# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 13-12-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు ప్రయాగ్ రాజ్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారు.
2. రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా రాజ్యాంగంపై ఈరోజు లోక్ సభలో ప్రత్యేక చర్చ జరుగుతోంది.
3. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్-2047ను ఈరోజు విజయవాడలో ఆవిష్కరించారు.
4. రాష్ట్రవ్యాప్తంగా రేపు జాతీయ లోక్అదాలత్ జరగనుంది.
5. రాష్ట్రంలో కానిస్టేబుల్ నియామకాలకు సంబంధించిన దేహదారుఢ్య పరీక్షలను ఈ నెల 30 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 1 వరకు నిర్వహించనున్నారు.

==========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు ప్రయాగ్ రాజ్‌లో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా గంగా, యమునా, సరస్వతి నదుల పవిత్ర సంగమం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హనుమాన్ మందిరం, సరస్వతి కూప్‌ను దర్శించుకున్నారు. అలాగే వచ్చే జనవరి 13 నుండి ఫిబ్రవరి 26 వరకు జరగనున్న కుంభమేళా పై ఏర్పాటు చేసిన మహాకుంభ్ ప్రదర్శనను నరేంద్ర మోదీ సందర్శించారు. కాగా ఈ మధ్యాహ్నం ప్రయాగ్ రాజ్ మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు 7 వేల కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. ప్రయాగ్ రాజ్ చుట్టుపక్కల ప్రాంతాలకు ప్రయాణ సౌలభ్యాన్ని మెరుగుపరచడానికి, శుద్ధి చేయని మురుగునీరు గంగలోకి ప్రవహించకుండా నిరోధించే ప్రాజెక్టులను కూడా నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు.

--------------------------

రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రాజ్యాంగంపై రెండు రోజుల చర్చ ఈరోజు లోక్ సభలో జరుగుతుంది. భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన 75వ వార్షికోత్సవం పై ఈ ప్రత్యేక చర్చ జరుగుతోంది. లోక్ సభలో రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్ రాజ్యాంగంపై చర్చను ప్రారంభించారు. రేపు లోక్ సభలో రాజ్యాంగంపై రెండు రోజుల చర్చకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సమాధానం ఇవ్వనున్నారు. కాగా ఈనెల 16, 17వ తేదీల్లో రాజ్యసభలో రాజ్యాంగపై చర్చ జరగనుండగా రాజ్యసభలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ

చర్చపై సమాధానం ఇచ్చే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి

---------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్-2047ను ఈ రోజు విజయవాడలో ఆవిష్కరించారు.'పది సూత్రాలు.. ఒక విజన్' పేరిట డాక్యుమెంట్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. జాతికి, రాష్ట్ర ప్రజలకు ఇది అంకితమని రాసి సంతకం చేశారు. అనంతరం ఉపముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్, రాష్ట్ర మంత్రులుతో పాటు పలువురు శాసనసభ్యులు ఇతర ముఖ్య అధికారులు సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్ మాట్లాడుతూ,

.....వాయిస్.... 30 సెకన్లు....

---------------------------

రాష్ట్రంలోని సాగు నీటి సంఘాలకు రేపు ఎన్నికలు జరగనున్నాయి. దీనికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను చేస్తోంది. రేపు నీటి వినియోగదారుల సంఘాలకు, 17వ తేదిన డిస్ట్రిబ్యూటరీ కమిటీ డీసీలకు ఎన్నికలు జరగనున్నాయి. జిల్లాలలో ఈ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి సంఘానికి ఒక అధికారిని, డిస్ట్రిబ్యూటర్ కమిటీల ఎన్నికల నిర్వహణకు జిల్లా అధికారుల్ని ప్రభుత్వం నియమించింది. రేపు నీటి సంఘాల ఎన్నికలతో పాటు సభ్యులు సమావేశమై అధ్యక్షులు, ఉపాధ్యక్షులతోపాటు ఆరుగురు డైరెక్టర్లను ఎన్నుకుంటారు. అధ్యక్షులుగా ఎన్నికైన వారు ఈనెల 17న డీసీలను ఎన్నుకుంటారు. ఇలా ఎన్నికైన డీసీలు ప్రాజెక్టు కమిటీని ఎన్నుకుంటారు.

---------------------------

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని న్యాయ స్థానాల్లో రేపు జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహించనున్నట్లు ఆ సంస్థ సభ్య కార్యదర్శి ఎం. బబిత తెలిపారు. ప్రజలు, కక్షిదారులకు దగ్గరలో ఉన్న న్యాయ స్థానాల్లో లోక్‌అదాలత్ లను నిర్వహిస్తారని వివరించారు. న్యాయస్థానాల్లో రాజీపడదగిన అన్ని రకాల సివిల్ కేసులు, క్రిమినల్ కేసులన్నింటినీ ఈ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు ఉపయోగించుకొని సమయాన్ని, నగదును ఆదా చేసుకోవాలని కోరారు. రాజీకి అవకాశమున్న కేసులలో సత్వర పరిష్కారం పొందేలా లోక్‌అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని ఆమె ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా లోక్ అదాలత్ పై కర్నూలు జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి బి. లీలా వేంకట శేషాద్రి మాట్లాడుతూ

వాయిస్.. 25 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంతంలోని విజయవాడ శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం అభివృద్ధికి ప్రసాద్ పథకం కింద నిధులు విడుదల చేయాలని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షేకావత్ ను కోరారు. ఢిల్లీలో కేంద్రమంత్రితో శివనాధ్ నిన్న సమావేశమై దేవస్థానం అభివృద్ధి అంశంపై చర్చించారు. ప్రసాద్ పథకం కింద 100 కోట్ల రూపాయలు విడుదల చేయాలని చేసిన విజ్ఞప్తి పై త్వరితగతిన చర్యలు తీసుకుని, నిధులు మంజూరు చేయాలని కోరారు. భక్తుల అవసరాలను

దృష్టిలో పెట్టుకుని వారి అవసరాలు తీర్చే విధంగా మెరుగైన సౌకర్యాలు, సదుపాయాలు కల్పించటంతోపాటు ఆలయ అభివృద్ధి గురించి మంత్రికి వివరించారు. ఈ అంశంపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని శివనాథ్ తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో కానిస్టేబుల్ నియామక ప్రక్రియకు సంబంధించిన దేహదారుఢ్య పరీక్షలను ఈ నెల 30 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 1 వరకు నిర్వహించనున్నట్లు పోలీసు నియామక మండలి ఛైర్మన్ ఎం.రవిప్రకాష్ ప్రకటించారు. ఉమ్మడి జిల్లాల్లోని ప్రధాన కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ నెల 18 నుంచి 29 వరకు కాల్‌లెటర్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని చెప్పారు. సందేహాలుంటే 94414 50639 లేదా 91002 03323 నంబర్లలో సంప్రదించాలన్నారు.

---------------------------

దేశవ్యాప్తంగా నిర్వహించిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2024, పోటీలో ఐఐటి ఖరగ్ పూర్ కు చెందిన ఐదు బృందాలు సాఫ్ట్ వేర్ ఎడిషన్‌లో విజయం సాధించాయి. కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి డాక్టర్ సుకంద మజుందర్ దృశ్య మాధ్యమం ద్వారా విజేతల పేర్లను ప్రకటించారు. హ్యాకథాన్‌లో భాగంగా సాఫ్ట్ వేర్ ఎడిషన్‌లో 35 బృందాలు పాల్గొన్నాయి. 36 గంటల పాటు జరిగిన ఈ పోటీలో తమ తమ బృందాలకు ఇచ్చిన సమస్యలకు అభ్యర్థులు పరిష్కారాలు కనుగొన్నారు. ఈ హ్యాకథాన్‌లో దేశవ్యాప్తంగా 17 బృందాలు విజేతలుగా ఎంపిక కాగా, విజేతలకు లక్ష రూపాయల నగదు బహుమతిని కేంద్రప్రభుత్వం అందజేసింది.

---------------------------

దేశాభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని తిరుపతి జిల్లా యువజన అధికారి బి.ప్రదీప్ కుమార్ తెలిపారు. తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో "యువ ఉత్సవ్" కార్యక్రమాన్ని విశ్వవిద్యాలయం డీన్ కాత్యాయనితో కలిసి ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు సైన్స్ మేళా, వకృత్వ పోటీలు, చిత్రలేఖనం, ఫోటోగ్రఫీ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ, జిల్లా యువజన శాఖ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. యువ ఉత్సవ్ వంటి కార్యక్రమాలు యువతకు స్ఫూర్తిదాయకంగా ఉండడంతోపాటు వారి ప్రతిభాపాటవాలను పదర్శించేందుకు దోహదపడతాయని తెలుపుతూ,

వాయిస్ 25.. సెకన్లు

---------------------------

రైతులు పండించే పత్తిని కొనుగోలు కేంద్రాలకు తరలించి మద్దతు ధర పొందాలని పార్వతీపురం మన్యం జిల్లా మార్కెటింగ్ అధికారి ఐ.గంగాధర రావు తెలిపారు. ఈ మేరకు ఈరోజు ఒక ప్రకటన విడుదల చేశారు పత్తి రైతుల కోసం సాలూరు మార్కెట్ యార్డులో భారత పత్తి సంస్థ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి పంటను కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. రైతులు దళారుల వద్దకు వెళ్లకుండా కొనుగోలు కేంద్రంలో పత్తిని విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు. కొనుగోలులో రైతులకు సమస్యలు ఎదురైతే అధికారులను సంప్రదించవచ్చని తెలిపారు.

=====================